

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**రాత్రి నిద్రపట్టక** అనేకర్లు లేచాను 15 వాట్ బల్బ్ నుండి మంద్రంగా వెలుగు వస్తోంది. అసలు కన్నా వడ్డీ ఎక్కువ అన్నట్లు అందరినీ వదిలి వచ్చిన దిగులు కన్నా ఇలాంటి ఇంట్లో ఉండాల్సి వచ్చినందుకు దిగులు ఎక్కువ కలిగింది. అన్నయ్య దగ్గర హాయిగా ఉన్నాను. నిన్న ఈ పాటికి మెత్తటి పరుపు మీద, మహారాణిలా ఓ గదిలో పడుకున్నాను. ఇప్పుడు దాదాపు కటికనేల మీద పడుకోవాల్సి వచ్చింది. ఇంట్లో ఎంతో సుఖంగా ఉండేదాన్ని. రాత్రిళ్ళు నిద్రపట్టకపోతే హాయిగా సినిమాలు చూస్తూ, అమ్మమ్మ చేసిన జంతికలు తింటూ కాలక్షేపం చేసేదాన్ని.

అన్నీ గుర్తొచ్చి చీకటిలో ఎవరికీ వినబడకుండా రాత్రంతా కుమిలిపోయి ఏడ్చాను. పొద్దున లేవగానే అమ్మకి ఫోన్ చేసి నేను తిరిగి వచ్చేస్తానని చెప్తాను. తప్పకుండా ఆనంద భాష్పాలు రాల్చి అన్నయ్యని ఆ రాత్రికే టికెట్ బుక్ చెయ్యమని చెప్తుంది. ఎంచక్కా ఇండియాకి వెళ్ళిపోయి దర్జాగా ఉండచ్చు. ఏదో ఉద్యోగం చూసుకుని అమ్మ వంట తింటూ నా గదిలో నేను నిద్రపోవచ్చు. సాయంత్రాలు దీపిక వాళ్ళ ఇంటికి, మంగళవారాలు ఆంజనేయస్వామి గుడికి, పండగలకి అమ్మమ్మ

వాళ్ళ ఊరికి వెళ్ళచ్చు. అన్నయ్య కొన్న పొట్టి బట్టలు వేసుకోవాల్సిన అవసరం రానేరాదు. బాత్‌రూం, కిచెన్‌లని కలిసి వాడే బాధ కలగదు. ఎయిర్ పోర్ట్‌కి అమ్మ, నాన్న, పెద్దమ్మ, పెదనాన్న వస్తారు. చూసిన వెంటనే వాళ్ళని కౌగిలించుకుని భోరున ఏడ్చేస్తాను. ఇంటికి వెళ్ళగానే అమ్మ చేతి వంట తింటాను.

కబుర్లు చెప్పుకున్నాక నా మంచం మీద నేను వెచ్చగా రగ్గు కప్పుకుని ప్రశాంతంగా నిద్రపోతాను. ఆ ఆలోచనలతో కళ్ళు మూసుకుని నిద్రలోకి జారుకున్నాను. కిచెన్‌లో ఏదో కింద పడిన శబ్దానికి మెలుకువ వచ్చింది. అమ్మ నేను నిద్రపోతున్నప్పుడే అంత అజాగ్రత్తగా పనిచేస్తుంది. ఓ రెండు నిమిషాల్లో టీవీ ఊరంతా వినబడేంత సౌండ్ పెంచుతుంది. రెండు నిమిషాలు దాటినా టీవి వినబడకపోవడంతో ఏమైందా అని లేచాను. నా కళ్ళు అలవాటు పడి ఎక్కడున్నానో గ్రహించడానికి ఓ నిమిషం పట్టింది. ఇండియాలో కాదు, ఇండియానాలో ఉన్నానని అర్థమైంది. దిగులు తిరిగి మొదలైంది. అమ్మ గిన్నెల్ని పడేసి, టీవి స్పీకర్ నా పక్కనే పెట్టినా ఫరవాలేదు. నాకు అమ్మకావాలి. కళ్ళు తుడుచుకుని ఫోన్ తియ్యబోతుంటే తలుపు తెరుచుకుని హనీష వచ్చింది.

"సారీ ప్లేట్ కింద పడింది. డిస్టర్బ్ అయ్యిందా?" అడిగింది.

"లేదు. అప్పటికే మెలుకువ వచ్చేసింది."

"మరి ఇంకా లేవలేదేంటి?"

"బద్ధకంగా ఉంది."

"నాకూ పొద్దున అలానే ఉంటుంది. వింటర్‌లో ఇంకా కష్టం. బయట స్నో పడుతున్నప్పుడు లేవాలంటే ఏడుపొస్తుంది. నిద్ర బానే పట్టిందా?"

"ఆఁ బానే పడుకున్నాను."

"బ్రేక్ ఫాస్ట్ ఏం తింటావు?"

"ఏం వద్దు."

"నీకు దోసెలు ఇష్టమేనా?"

"ఇష్టమే కానీ. ఒద్దు."

"ఏఁ బ్రేక్ ఫాస్ట్ అలవాటు లేదా?"

"ఉంది. నేను ఓట్ మీల్ తినేస్తా"

"ఓట్స్‌లో ఏం వేసుకుంటావు?"

"ఓన్లీ వాటర్ చాలు. ఇంకేం అక్కర్లేదు"

"ఏంటి? ఉత్త ఓట్స్‌ని నీళ్ళతో తింటావా?" చాలా ఆశ్చర్యపోయింది.

"ఔను అది చాలు నాకు."

"ఏం అవసరంలేదు. నువ్వు కూడా నాతో దోసెలు తిను. టమాటా పచ్చడి ఉంది. వెన్నీనే చేసింది. ఓట్స్ నువ్వు రూంకి వెళ్ళిపోయాక తిను. నీ రూం మేట్స్ ఎలాంటివాళ్ళు దొరుకుతారో తెలియదు కాబట్టి ఇక్కడ ఉన్నప్పుడు సుబ్బరంగా తిను. లేచి బ్రష్ చేసుకుని రా. నేను దోసెలు వేస్తూంటాను."

నా బదులు కోసం ఆగకుండా కిచెన్‌లోకి వెళ్ళిపోయింది. నేను వెంటనే లేచి పళ్ళు తోముకున్నాను. ఇవాళ కూడా స్నానం చెయ్యకూడదని నిశ్చయించుకున్నాను. కిచెన్‌లో తను ఫోన్ లో మాట్లాడుతూ దోసెలు వేయడం గమనించి

నిశ్శబ్దంగా నిన్న రాత్రి తోమిన కప్పులో కాఫీ కలుపుకున్నాను. అన్నయ్య దగ్గర అలవాటైంది కాబోలు, వీళ్ళ కాఫీ అంత స్ట్రాంగ్‌గా అనిపించలేదు.

"నువ్వు అంత సైలెంట్‌గా చెయ్యక్కర్లేదు. ఉత్త ఫ్రెండ్‌తోనే మాట్లాడాను, ప్రొఫెసర్‌తో కాదు" ఫోన్ పెట్టి చెప్పింది.

"నువ్వు మాట్లాడుకో. నా కోసం ఫోన్ పెట్టక్కర్లేదు" అన్నాను.

"పరవాలేదు. రోజూ ఉండేదే సోది గోల."

"రోజూ మాట్లాడతావా నీ ఫ్రెండ్‌తో?" ఆశ్చర్యపోయాను.

"యా. కానీ రోజూ ఒకే ఫ్రెండ్‌తో కాదు. ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు చేస్తారు. తెలీకుండానే గంట గడిచిపోతుంది."

"ఓ. ఒకే. నేను వెయ్యనా దోసెలు?"

"నీకు వచ్చా?" కుతూహలంగా అడిగింది.

"యా. చాలా ఈజీ."

"ఒకే వెయ్యి. నాకు వంట అస్సలు ఇష్టంలేదు. తప్పక చేస్తుంటాను" అని పక్కకి జరిగింది.

"నాకు వంట ఇష్టమే. గిన్నెలు తోమడం చిరాకు."

"అయితే ఇక నుండి నువ్వు వంట చెయ్యి. నేను గిన్నెలు తోముతాను."

"ఒకే. డీల్."

ఇద్దరం కలిసి దోసెలు ప్లేట్‌లో పెట్టుకుని టమాటా పచ్చడి వేసుకున్నాము.

"నీకు వంట బాగా వచ్చా?" అడిగింది.

"ఫరవాలేదు. నీకు అస్సలు రాదా?"

"ఒకే. ఒకే. తినగలిగేట్టు చేస్తా. ఇక్కడ అందరూ నా వంటని ఏడిపిస్తారు. కానీ నువ్వు టేస్ట్ చేసేంతవరకు ఎవరినీ నమ్మకు."

నవ్వి "సరే" అన్నాను.

"మీ అన్నయ్య ఒక్కడే ఉంటాడా?"

"ఔను"

"పెళ్లైందా?"

"ఇంకా లేదు."

"సంబంధాలు చూస్తున్నారా?"

"ఇంకా స్టార్ట్ చెయ్యలేదు."

"లక్కీ. మా అన్నకి జాబ్ రాగానే సంబంధాలు వెతకడం మొదలు పెట్టారు. నాకు జాబ్ కూడా అక్కర్లేదు. గ్రాడ్యుయేట్ అయితే చాలు, టార్చర్ మొదలు పెడతారు."

"ఓ. మీ ఇంట్లో స్ట్రిక్టా?"

"మామూలుగా కాదు. నేను స్లీవ్‌లెస్ వేసుకున్న ఫోటో చూసి మా అమ్మ లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చింది."

"ఓ ఔనా. మా ఇంట్లో మరీ అంత స్ట్రిక్ట్ కాదు స్లీవ్‌లెస్ వేసుకోవచ్చు."

దోసెలు తినడం పూర్తయి ప్లేట్లు సింక్‌లో పెట్టాము.

"నీకు యూనివర్సిటీ చూపిస్తా. పద వెళ్దాం."

"ఇప్పుడా?"

"యా ఇంట్లో బోర్ కదా. ఎలా అయినా నువ్వు చూడాలి. పద  చూపిస్తా. వెన్నీ సాయంత్రం వరకు ఇంటికి రాదు."

"ఓ సరే థాంక్స్"

"థాంక్స్ అక్కర్లేదులే" ఇద్దరం చెప్పులు వేసుకుని నడవసాగాము. కొంచెం దూరం నడిచాక "ఇదే కేంపస్" అంది.

"ఇంత దగ్గరా?" ఆశ్చర్యపోయాను.

"ఔను స్టూడెంట్స్ చాలా వరకు ఈ అపార్ట్‌మెంట్స్‌లోనే ఉంటారు" ఇంకొంచెం దూరం నడిచాక "ఇది లైబ్రరీ" అంది.

"ఒకసారి లోపలికి వెళ్దామా?" అడిగాను.

"యా వెళ్దాం" తలుపు తెరిచింది. అక్కడ ఉన్న పుస్తకాలు అన్నీ చదువుకి సంబంధించినవి ఉంటాయనుకున్నాను కానీ మామూలు నవలలు కూడా కొన్ని కనబడ్డాయి. అక్కడ షెల్ఫ్‌లో ఉన్న 'గేబ్రియెలా, క్లవ్ అండ్ సినమన్' పుస్తకాన్ని తీసి "ఇది మా అన్నయ్య దగ్గర ఉంది" అన్నాను. దాని కింద అరలో ఒమార్ కబీజీస్ రాసిన 'ఫైర్ ఫ్రం మౌంటెన్' తీసి "ఇది చాలా మంచి బుక్ అట. నువ్వు చదువుతావా?" అడిగాను.

"లేదు. నేను చేతన్ బగత్ ఫై పాయింట్ సం వన్ చదవడానికే నాలుగు నెలలు కష్టపడ్డా. ఇంక ఇలాంటి బుక్స్‌లో ఇంగ్లీష్ చదవాలంటే ముందు డిక్షనరీ చదవాలేమో" అంది.

"చేతన్ బగత్ నాకూ బోర్ కొట్టింది. ఇవి బానే ఉంటాయి."

"రొమాంటిక్ బుక్కా?"

"నాకు తెలిసి ఇంటలెక్చువల్ అయి ఉంటుంది. లేకపోతే మా అన్నయ్య చదవడు. అయినా రొమాంటిక్ కన్నా మిస్టరీనే చదవడానికి బావుంటాయి" ఇద్దరం లైబ్రరీ నుండి బయటికి వచ్చాము.

"నువ్వు బుక్స్ ఎక్కువ చదువుతావా?" అంది.

"లేదు. ఈ మధ్యే మొదలు పెట్టాను"

"నువ్వు మాట్లాడుతుంటే చాలా చదివేసినట్టు ఉంది."

నవ్వి ఊరుకున్నాను.

"ఈ బిల్డింగ్‌లో ఎక్కువ ఎలక్ట్రికల్ క్లాసెస్ జరుగుతాయి. ఈ బిల్డింగ్ మెకానికల్ ఇంజనీరింగ్.. ఇది జిమ్. ఇది స్విమ్మింగ్ పూల్. ఇది బయో సైన్సెస్ బిల్డింగ్. ఇదే మీ ఏరో స్పేస్ బిల్డింగ్. మీ క్లాసెస్ అన్నీ ఇక్కడే ఉంటాయి" అంటూ అన్నీ చూపించి చివరికి  'ఇదే కాఫెటేరియా' లోపలికి పద ఎవరున్నారో చూసి నీకు కొంతమందిని పరిచయం చేస్తా" అంటూ లోపలికి నడిచింది. తలూపుతూ నేనూ తన వెనకే వెళ్ళాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story